నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
2 అక్టోబర్ 2024
పేజీలు 8

### సబు వర్గీస్

'వన్యప్రాణి సంరక్షణ సేవ కోసం క్రికెటర్లు' అనే అవార్డు ఈ ఏడాది సబు వర్గీస్‌కు అందజేశారు. ఒకప్పుడు అతను పెరియార్ పులుల రిజర్వ్‌లో స్మగ్లర్‌గా ఉండేవాడు. తర్వాత అతనిలో మార్పు వచ్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాడు. దీంతో అతడికి ఈ అవార్డ్ దక్కింది. ప్రముఖ క్రికెటర్లు సందీప్ పాటిల్, యూసుఫ్ పఠాన్, హర్భజన్ సింగ్ ఈ అవార్డును నెలకొల్పారు. అదేవిధంగా వైల్డ్‌లైఫ్ క్రూసేడర్ విభాగంలో జయచంద్రన్‌కు అవార్డు లభించింది.

## అంతర్జాతీయం

**ఐక్యరాజ్య సమితి**

- భవిత సమావేశాన్ని న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే ఐక్యరాజ్య సమితి నిర్వహించింది. 21వ శతాబ్ద సవాళ్లను ఎదుర్కొనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని చేపట్టారు. సుస్థిరాభివృద్ధికి అన్ని దేశాలు కలిసి కట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ విషయంలో పేద దేశాలకు ఆర్థిక వనరులను సమకూర్చేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను సన్నద్ధం చేయాలని కూడా తీర్మానించారు.
- ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 79వ



సమావేశాల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఒకే భూమి ఒకే కుటుంబం ఒకే భవిష్యత్, అలాగే ఒకే సూర్యుడు, ఒకే ప్రపంచం, ఒకే గ్రిడ్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై మాట్లాడారు.

**అమెరికా**

- మినరల్స్ సెక్యూరిటీ ఫైనాన్స్ నెట్‌వర్క్‌లో భారత్ చేరింది. అమెరికా నేతృత్వంలో ఇది కొనసాగనుంది. ఇందులో 14 దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ కూడా భాగస్వామిగా ఉంది. మినరల్ సెక్యూరిటీ పార్ట్‌నర్‌షిప్‌ను అమెరికా 2022లో ప్రారంభించింది. ముఖ్యమైన ఖనిజాల సరఫరా గొలుసుకు సభ్యత్వ దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

**అర్మేనియా**

- భారత దేశం నుంచి ఎక్కువగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశంగా అర్మేనియా నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి 600 మిలియన్ డాలర్ల ఆయుధాలను ఆ దేశం కొనుగోలు చేసింది.

**ఈస్టర్న్ బ్రిడ్జ్**

- ఈస్టర్న్ బ్రిడ్జ్ పేరుతో భారత్, ఒమన్ దేశాలు



ద్వైపాక్షిక సైనిక విన్యాసాన్ని నిర్వహించాయి. సెప్టెంబర్ 11 నుంచి 22 వరకు ఇవి కొనసాగాయి. ఒమన్‌లోని మసిరాలో జరిగిన ఈ విన్యాసాల్లో భారత వైమానిక దళం, రాయల్ ఎయిర్‌ఫోర్స్ ఆఫ్ ఒమన్ పాల్గొన్నాయి.

**బ్రెజిల్**

- సుస్థిర వైమానిక ఇంధనం విషయంలో భారత్, బ్రెజిల్ పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. పునరుత్పాదక జీవ ద్రవ్యం, వృథా నుంచి దీన్ని తయారు చేస్తారు. దీన్ని వినియోగించడం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు 80% తగ్గుతాయి.

**విల్మింగ్టన్ ప్రకటన**

- క్యాన్సర్ కట్టడికి చర్యలతో పాటు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్రయాన భద్రత ఉండాలని క్వాడ్ సదస్సులో నిర్ణయించారు. క్వాడ్ దేశాల సమావేశం అమెరికాలోని విల్మింగ్టన్‌లో నిర్వహించారు. భారత్‌తో పాటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ప్రభుత్వాధినేతలు ఇందులో పాల్గొన్నారు. మొత్తం సమావేశాల సారాంశాన్ని విల్మింగ్టన్ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఈ కూటమి సమావేశం భారత్‌లో జరగనుంది. క్వాడ్ దేశాలకు చెందిన ప్రతినిధులు విల్మింగ్టన్ ప్రకటనలో పాల్గొన్నారు.




## వార్తల్లో వ్యక్తులు

**అనుర కుమార దిసనాయకే**



- శ్రీలంక అధ్యక్షుడిగా నేషనల్ పీపుల్స్ పవర్‌కు చెందిన నాయకుడు అనుర కుమార దిసనాయకే ఎన్నికయ్యారు. అలాగే ఆ దేశ ప్రధానిగా హరిణి అమరసురియా ప్రమాణ స్వీకారం చేశారు.

**చిరంజీవి**

- నటుడు చిరంజీవి గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించారు. 537 పాటల్లో 24 వేల స్టెప్పులతో ప్రేక్షకులను అలరించినందుకు ఆయనకు ఈ ఘనత దక్కింది.

**సునీతా విలియమ్స్**

- అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు సునీతా విలియమ్స్ నేతృత్వం వహించనున్నారు. ఈ బాధ్యతను ఆమె చేపట్టడం ఇది రెండో సారి. ఇప్పటి వరకు దీనికి నేతృత్వం వహించిన ఒలెగ్ కొనొనెంకో బాధ్యతలను సునీతా విలియమ్స్‌కు అప్పగించారు.

**సిద్ధరామయ్య**

- కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రిపై లోకాయుక్త పోలీసులు విచారణ చేపట్టాలని బెంగళూర్ ప్రత్యేక కోర్ట్ సూచించింది. మైసూర్ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలో అక్రమాలకు సంబంధించి ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ తీర్పు వెలువడింది.

**ఇబ్రహిమా చెక్ డియోంగ్**

- లాస్ అండ్ డ్యామేజీ నిధికి తొలి డైరెక్టర్‌గా సెనెగల్‌కు చెందిన ఇబ్రహిమా చెక్ డియోంగ్ నియమితులయ్యారు. ఈ నిధిని 2022లో ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి పర్యావరణ మార్పు ఒప్పంద ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఇది ఏర్పాటయ్యింది.

**సుశీల**



- నేపథ్య గాయని పీ సుశీలకు తమిళనాడు ప్రభుత్వం 'కలైజ్ఞర్ నినైవు కలైతురై విత్తగర్' అవార్డ్-2023 ప్రకటించింది. ఇది తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరిట ఏర్పాటు చేసిన అవార్డ్.

## తెలంగాణ

**కోట్నాక్ జంగు**

- గోండి లిపి ఆవిష్కర్త, గోండి గుణింతాలు, గణిత సృష్టికర్త కోట్నాక్ జంగు మరణించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల ప్రాంతానికి చెందిన వారు. తెలంగాణలోని ఆదివాసీ గోండు



చిన్నారుల కోసం గోండి తెలుగు వాచకాలను ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్రచురించి, వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేశారు.

**వరి దిగుబడిలో అగ్రస్థానం**

- వరి దిగుబడిలో 2023-24లో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. పత్తిలో 3, పొద్దు తిరుగుడులో 4, మొక్కజొన్న, చిరుధాన్యాల్లో 5వ స్థానాల్లో ఉంది.

**వాహన్**

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన్ వెబ్‌సైట్‌లోని డేటాబేస్‌తో అనుసంధానం కావాలని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ నిర్ణయించింది. దీనివల్ల వాహన కొనుగోలుదారులకు ప్రయోజనం ఉంటుంది. వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఆర్టీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వాహనం కొనుగోలు చేసిన డీలర్ ద్వారానే ఆ సేవలను అమలు చేస్తారు. అలాగే రవాణా శాఖకు సొంత వెబ్‌సైట్ అవసరం ఉండదు.

**మంత్రివర్గ సమావేశం**

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలు. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించాలని నిర్ణయించారు.
- ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి, 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం చేయనున్నారు.
- మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు,
- ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు.

## రోజులు-ప్రాధాన్యం

**సెప్టెంబర్ 26**

- ఏటా ప్రపంచ నౌకాయాన రోజును సెప్టెంబర్ 26న నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'భవిష్యత్తు పయనం: భద్రత ప్రధానం'. ఇదే రోజున అణ్వాయుధాలను పూర్తిగా నిర్మూలించే అంతర్జాతీయ రోజుగా కూడా నిర్వహిస్తారు. 2013లో యూఎన్‌జీఏ చేసిన తీర్మానం మేరకు సెప్టెంబర్ 26ను ఎంపిక చేశారు.

**సెప్టెంబర్ 25**

- ఏటా సెప్టెంబర్ 25న అంత్యోదయ దివస్‌గా నిర్వహిస్తారు. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఇదే రోజు. భారతీయ జన సంఘ్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు.

**సెప్టెంబర్ 23**

- ఏటా సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంజ్ఞల భాష రోజుగా జరుపుతారు. 1951, సెప్టెంబర్ 23న వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ అనే సంస్థను హెల్సింకిలో ఏర్పాటు చేశారు. అందుకే ఇదే రోజును సంజ్ఞల రోజుగా నిర్వహిస్తారు.

**సెప్టెంబర్ 22**

- ఏటా సెప్టెంబర్ 22న ప్రపంచ రైనో రోజుగా నిర్వహిస్తారు. ఈ జాతిని పరిరక్షించుకొనేందుకు, అవగాహన కల్పించేందుకు ఉద్దేశించింది ఇది.

**సెప్టెంబర్ 21**

- ఏటా సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి రోజుగా నిర్వహిస్తారు.

## జాతీయం

**మహిళా నాయకత్వం**

- అంతరిక్ష కార్యక్రమాలకు మహిళా నాయకత్వం కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రారంభించింది. బ్రిటిష్ కౌన్సిల్ ఇందుకు సాయం చేయనుంది. యూకే-ఇండియా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఇనిషియేటివ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

**యూపీ అగ్రస్థానం**

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' పథకంలో ఉత్తరప్రదేశ్ రికార్డ్ సృష్టించింది. జూన్ 5 నాటికి ఆ రాష్ట్రం 26.5 కోట్ల మొక్కలను నాటి అగ్రస్థానంలో నిలిచింది. ఈ పథకంలో భాగంగా తెలంగాణ



8.34 కోట్లు, గుజరాత్ 15.5 కోట్ల మొక్కలను నాటింది.

**శక్తిమంతమైన భారత్**

- ఆసియా ప్రాంతంలో మూడో శక్తిమంతమైన దేశంగా భారత్ నిలిచింది. గతంలో ఈ స్థానంలో జపాన్ ఉంది. తొలి స్థానంలో అమెరికా, చైనా నిలిచాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించిన దేశాల్లో శక్తిమంతమైన వాటిని లోవి ఇన్‌స్టిట్యూట్ అనే సంస్థ ఈ జాబితాను విడుదల చేసింది. కొవిడ్ నిర్వహణ, అంతర్జాతీయ అంశాల్లో భారత్ చొరవ ఆధారంగా ర్యాంక్ మెరుగైంది.

**రహదార్లకు పట్టణ వ్యర్థాలు**

- జాతీయ రహదార్ల నిర్మాణంలో పట్టణ వ్యర్థాలను వినియోగించుకోవాలని ఉపరితల రవాణా-హైవేల మంత్రిత్వ శాఖ నియమావళిని సూచించింది. ఇప్పటికే ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే, అహ్మదాబాద్-ధొలేరా ఎక్స్‌ప్రెస్ మార్గాల్లో ఈ తరహా పదార్థాన్ని వినియోగించారు.

**లాపతా లేడీస్**

- కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన లాపతా లేడీస్ చిత్రం 2025 ఆస్కార్ బరిలోకి వెళ్లనుంది. భారత్ తరఫున ఎంపికైన అధికారిక చిత్రం.

**పర్యాటక గ్రామం దేవ్‌మాలీ**



- రాజస్థాన్‌లోని అజ్మీర్ సమీప బ్యావర్ జిల్లాకు చెందిన దేవ్‌మాలీ భారత్‌లో ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికయ్యింది. నవంబర్ 27న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఈ గ్రామానికి అవార్డును అందించనుంది. గ్రామానికి చెందిన 3000 బిఘాల భూమిని స్థానికంగా కొండపై వెలసిన దేవనారాయణ్ స్వామికి అంకితం చేసిన ఘనత ఈ గ్రామానిది. గ్రామంలో మాంసాహారం ముట్టరు. మద్య నిషేధం అమలవుతుంది. వంటకు కిరోసిన్, వేప కలపను వినియోగించరు.

**ఏడీబీ అంచనాలు**

- 2024లో భారత్ 7% వృద్ధిని నమోదు చేస్తుందని అలాగే 2025లో ఈ వృద్ధి 7.2% ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంక్ పేర్కొంది. వ్యవసాయ రంగం సాధిస్తున్న పురోగతి, పారిశ్రామిక, సేవా రంగాలు కూడా మెరుగ్గా ఉండటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యయం బాగుందని ఈ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది.

**భారత్ సాయం**

- పేద, మధ్య తరగతికి చెందిన 30 దేశాలకు పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల నిర్మాణానికి 2.5 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని భారత్ ప్రకటించింది. సాయం పొందుతున్నవన్నీ చిన్న దీవి దేశాలే. కొలిషన్ డిజాస్టర్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే సంస్థ ద్వారా భారత్ ఈ ఆర్థిక సాయాన్ని అందించనుంది.

**చైల్డ్ పోర్న్‌పై తీర్పు**

- పసిపిల్లలు, బడులకు వెళ్లే చిన్నారులపై



లైంగిక అకృత్యాలు, అమానుష చర్యలకు ప్రేరేపిస్తున్న, మూల కారణమవుతున్న దుర్వ్యసనాలకు అడ్డుకట్ట వేసే దిశగా సుప్రీం కోర్ట్ పలు సూచనలు చేసింది. బాలలతో చిత్రించిన అశ్లీల దృశ్యాలను చూడటం, డౌన్‌లోడ్ చేయడమే కాదు, వాటిని కలిగి ఉన్నా నేరమే అని ప్రధాన ధర్మాసనం తీర్పు చెప్పింది. పోక్సో, ఐటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి శిక్షించవచ్చని తెలిపింది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

